ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
మంగళవారం 13 మే 2025
www.prajaswaramdaily.com
4 pm

# అప్పటి వరకు స్థానికత్వం : పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసే వరకు ఏపీలో తెలంగాణ పిల్లలకు స్థానికత్వం కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్రం, ఏపీ సర్కార్ నిర్ణయంతో సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష రాసిన 20వేల మంది విద్యార్థులు నైరాశ్యంలో ఉన్నట్లు తెలిపారు. దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో సైనిక్ స్కూళ్లు ఉన్నాయని, తెలంగాణలో తొందరగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.





# ఎస్-400 ముందు ప్రధాని మోదీ

**ఎస్-400 ముందు ప్రధాని మోడీ..**

**పాక్, చైనా చెప్పిందంతా అబద్ధమే అని తేలింది..**

**చైనా, పాక్ చెప్పినదంతా అబద్ధమే ..**

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం పంజాబ్ అదంపూర్ వైమానిక స్థావరాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న ఎయిర్ ఫోర్స్ సిబ్బందిని అభినందించారు. పాకిస్తాన్‌పై ''ఆపరేషన్ సిందూర్'' సమయంలో ఈ బేస్ కీలకంగా వ్యవహరించింది. అయితే, ప్రధాని ఒక్క చర్యతో పాకిస్తాన్, చైనాలు చెబుతున్నవి అబద్ధాలని రుజువు చేశారు. చైనా నిర్మిత జేఎఫ్ -17 యుద్ధ విమానాలు, రష్యా నిర్మిత ఎస్-400 క్షిపణి రక్షణ వ్యవస్థను ధ్వంసం చేశాయని పాకిస్తాన్ పేర్కొంది. యుద్ధ విమానాలు, రాడార్ స్టేషన్లని ధ్వంసం చేసినట్లు పేర్కొంది. చైనీ మీడియా కూడా పాకిస్తాన్ అబద్ధాలకు ప్రాముఖ్యత ఇస్తూ, ఈ విషయాన్ని తన పత్రికల్లో పేర్కొంది.

మంగళవారం, అదంపూర్ ఎయిర్ బేస్‌కి వెళ్లిన ప్రధాని మోడీ ఎస్-400 ముందు నిలబడి సైనికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ఒక్క చర్యతో పాకిస్తాన్ అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టారు. గత వారం, పాకిస్తాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను తిప్పికొట్టడంతో అదంపూర్ వైమానికి స్థావరం కీలక పాత్ర పోషించింది.

ప్రపంచంలోనే అత్యుత్తమ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌గా ఎస్-400 నిలిచింది. దీని పనితీరు అద్భుతంగా ఉందని భారత్ ప్రపంచానికి తెలియజేసింది. ఈ వ్యవస్థని భారత్ రష్యా నుంచి కొనుగోలు చేసింది. ప్రస్తుతం రష్యా ఎస్-500 వ్యవస్థపై పనిచేస్తోంది. దీనిని సంయుక్తంగా డెవలప్ చేయాలని రష్యా, భారత్‌కి ఆఫర్ ఇచ్చింది. ఇది ఒప్పందంగా మారితే , ప్రపంచంలోనే అత్యుత్తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ భారత్ సొంతమవుతుంది.



# ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

**ప్రజాభవన్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిన సుల్తానియా.**

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో అత్యంత కీలకమైన పదవుల్లో ఒకటైన ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పదవిలోకి సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియా నియమితులయ్యారు. మంగళవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నుంచి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా కె. రామకృష్ణారావు కొనసాగుతుండగా.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రిటైర్మెంట్ అయ్యారు. ఆ స్థానంలో కె. రామకృష్ణారావు సీఎస్‌గా నియమితులు కాగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి స్థానం ఖాళీ అయ్యింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆ స్థానంలో సందీప్ కుమార్ సుల్తానియాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది .

మే 13 సాయంత్రం లేదా రేపు ఉదయం సందీప్ సుల్తానియా తన కొత్త బాధ్యతలు అధికారికంగా చేపట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం ప్రజా భవన్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. సుల్తా



నియాను ఆర్థిక శాఖకు నియమించడంపై అధికార వర్గాల్లో విశ్వాసం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ విధానాల అమలు, బడ్జెట్ నిర్వహణ, ఆర్థిక అనుభవం కలిగిన అధికారిగా ఆయనకు మంచి పేరు ఉంది.



# ఇండోనేషియాలో పేలుడు

**13 మంది మృతి**

**నలుగురు సైనికులు, తొమ్మిది మంది నివాసితులు**

జకార్తా : ఇండోనేషియాలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 13 మంది దుర్మరణం చెందారు. సైన్యానికి సంబంధించిన కాలం చెల్లిన పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేస్తుండగా ఒక్కసారిగా ఈ పేలుడు సంభవించింది. దీంతో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇండోనేషియాలోని పశ్చిమ జావా ప్రావిన్స్‌లోని గరుట్ రీజెన్సీలో మందుగుండు సామగ్రి నిర్వీర్యం చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 13 మంది చనిపోయారని సైనిక అధికారి తెలిపారు. జకార్తా సమయం ప్రకారం ఉదయం 09.30 గంటలకు గరుట్ రీజెన్సీలోని సాగర గ్రామంలో ఈ ఘోరం జరిగింది. బాధితుల్లో నలుగురు సైనికులు, తొమ్మిది మంది నివాసితులు ఉన్నారని ఇండోనేషియా ఆర్మీ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ వాహ్యు యుధాయన పేర్కొన్నారు. బాధితులందరినీ పమెంగ్‌ప్యూక్ జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. తొలుత రెండు చోట్ల పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశారని.. మూడో చోట చేస్తుండగా ఊహించని విధంగా ఈ దుర్ఘటన జరిగినట్లుగా వివరించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుగుతోందని వెల్లడించారు.



# పొల్లాచి లైంగిక వేధింపుల కేసు.. తొమ్మిది మంది దోషులు

**- తేల్చిన కోయంబత్తూర్ సెషన్స్ కోర్టు**

చెన్నై : తమిళనాడు లోని పొల్లాచిలో 2019లో వెలుగు చూసిన లైంగిక వేధింపుల ఈ కేసులో నిందితులుగా ఉన్న తొమ్మిది మందిని కోయబంత్తూర్‌లోని సెషన్స్ కోర్టు దోషులుగా తేల్చింది. 2019 నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. వారిని మంగళవారం కట్టుదిట్టమైన భద్రతతో సెషన్స్ కోర్టుకు తీసుకొచ్చారు. విచారణలో భాగంగా న్యాయస్థానం వీరందరినీ దోషులుగా తేల్చింది. మధ్యాహ్నం వీరికి శిక్షను ఖరారు చేయనుంది. దోషులకు జీవిత ఖైదు విధించాలని బాధితుల తరపు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు.

**ఏంటీ పొల్లాచీ కేసు...**

2016-18 మధ్య కాలంలో ఒక కళాశాల విద్యార్థినితో సహా పలువురు మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసు . నిందితులు మహిళలను లైంగికంగా వేధించడమే కాకుండా వాటిని మొబైల్ ఫోన్‌లలో చిత్రీకరించారు. వాటిని ఉపయోగించి మహిళలను డబ్బు కోసం బ్లాక్ మెయిల్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొత్తం 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసును తొలుత పొల్లాచి పోలీసులు విచారణ చేశారు. అనంతరం తమిళనాడు క్రైమ్ బ్రాంచ్- క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ కు బదిలీ చేశారు. ఆ తర్వాత సీబీఐకి బదిలీ చేశారు. ఈ కేసు తమిళనాడులో పెద్దఎత్తున సంచలనం సృష్టించింది. రాజకీయంగానూ తీవ్ర దుమారం రేపింది. ఈ కేసు దర్యాప్తు సమయంలో బాధితుల తరపున 200కు పైగా పత్రాలను, 400 ఎలక్ట్రానిక్ పరికరాలను ఆధారాలుగా చూపించారు.



# హవాలా ద్వారా సొమ్ము

**ఆదాయపు పన్ను కమిషనర్ జీవన్‌లాల్ కేసు..**

**కీలక అంశాలు వెలుగులోకి**

హైదరాబాద్: ఇటీవల ముంబయిలో రూ.70 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన హైదరాబాద్ ఆదాయపు పన్ను కమిషనర్ జీవన్‌లాల్ కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ముంబయికి చెందిన ఎన్‌డీడబ్ల్యూ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.2.5కోట్ల విలువైన ప్లాట్‌ను లంచంగా తీసుకున్నట్లు తేలింది. ఖమ్మం జిల్లాకు చెందిన బినామీ దండెల్ వెంకటేశ్వరుల పేరిట ఆ ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయించినట్లు అధికారులు గుర్తించారు. ముంబయిలోని మరో రెండు సంస్థల నుంచి రూ.35 లక్షలు లంచం తీసుకున్నట్లు సీబీఐ గుర్తించింది. ఈ సొమ్మును హవాలా ద్వారా స్వీకరించినట్లు దర్యాప్తు బృందం ఆధారాలు సేకరించింది.

షాపూర్జీ పల్లోంజీ నిర్మాణ సంస్థ ట్యాక్సేషన్ ఫైల్ పెండింగ్‌ను క్లియర్ చేసేందుకు రూ.1.20 కోట్లు లంచం డిమాండ్ చేసినట్లు సీబీఐకి స్పష్టమైన సమాచారం ఉంది. ఇద్దరు మధ్యవర్తుల ద్వారా రూ.15 లక్షలు లంచం తీసుకున్న జీవన్ లాల్.. మరో రూ.70 లక్షలు తీసుకుంటుండగా పక్కా ఆధారాలతో సీబీఐ అధికారులు పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో మొత్తం 15 మందిపై సీబీఐ అధికారులు కేసులు నమోదు చేశారు. లంచం ఇచ్చిన వారిని కూడా నిందితులుగా చేర్చారు.

